క్లుప్తంగా

పింఛనర్లకు అండగా సీఎం జగన్



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో పింఛనర్లకు కొండంత అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా అన్నారు. ఆ డివిజన్‌లో 'వైఎస్సార్ పెన్షన్ కానుక'లను మంగళవారం ఆమె పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడం, విద్యార్థులకు పరీక్షలు ముగియడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు సిందూరం, ఆకు పూజలు నిర్వహించారు. సాయంత్రం హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

రైల్వే ఆస్పత్రిలో ఆస్తమాపై అవగాహన

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా మంగళవారం రైల్వే హాస్పటల్ ఓపీడీ బ్లాక్‌లో రోగులకు ఆస్తమా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైల్వే హాస్పటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల ఆస్తమా లక్షణాలు, రోగ నిర్ధారణ, చికిత్సను వివరించారు. ధూమపానాన్ని నివారించాలని, రోజూ బ్రీతింగ్ వ్యాయామం అభ్యసిస్తే ఆస్తమా నుంచి దూరంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో పల్మనాలజిస్ట్ డాక్టర్ టి.కార్తీక్, ఏసీఎంఎస్‌లు జయ్‌దీప్, వి.బి. మనోజ్, లక్ష్మీతులసి, 150 మంది రోగులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మోతాదుకు మించి మందులు వాడటంతో అపస్మారక స్థితికి చేరుకున్న వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన షేక్ చాన్‌బీ, ఖాసిం భార్యభర్తలు. ఖాసిం మానసిక స్థితి సరిగా లేక పోవడంతో ప్రభుత్వాస్పత్రిలో మందులు వాడుతున్నాడు. గత నెల 24న ఖాసిం మోతాదుకు మించి మందులు వాడటంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతన్ని కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఘటనపై మృతుని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

వైభవంగా సత్యదేవుని కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లోని సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వైశాఖ మాసం ఏకాదశి రోజు స్వామి వారి కల్యాణం చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా స్వామి వారి సన్నిధిలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను కల్యాణవేదికపై అధిష్టింపజేశారు. ఆగమ పండితులు పర్యవేక్షణలో పలువురు దంపతులతో స్వామి వారి సామూహిక కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఈఓ హేమలతాదేవి పర్యవేక్షించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

- 30వ డివిజన్‌లో పరిష్కారమవుతున్న సమస్యలు
- తుదిదశకు చేరుకున్న యూజీడీ పైపులైన్ పనులు
- రూ. 3.6 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీనికి తార్కాణం 30వ డివిజన్. ఎన్నో ఏళ్లుగా పరిష్కారమవ్వని సమస్యలు సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కారమవుతున్నాయి. కోట్లాది రూపాయల వ్యయ అంచనాతో చేపట్టిన యూజీడీ పైపులైన్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కనీసం ఎక్కడ యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మించాలో కూడా తెలియకుండానే పైపులైన్ పనులు ప్రారంభించి వదలేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికులతో మాట్లాడి గద్దె వెంకట్రామయ్యనగర్ ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్ సమీపంలో యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టారు. యూజీడీ పైపులైన్ పనులు సైతం పూర్తయ్యాయి.

చురుగ్గా మ్యాన్‌హోల్స్ పనులు

ప్రస్తుతం ఇక్కడ ఇంటర్మీడియట్ మ్యాన్‌హోల్స్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గతంలో ఇంటి నుంచి యూజీడీ కనెక్షన్లను పైపులకు ఇచ్చేవారు. దీంతో తరచూ ఎలుకలు, ఇతర సమస్యలతో పైపులు బ్లాక్ అయ్యేవి. దీంతో యూజీడీ సమస్యలు వచ్చేవి. ఈ సమస్యల పరిష్కారానికి వినూత్నంగా ఇంటర్మీడియట్ మ్యాన్‌హోల్స్ నిర్మిస్తున్నారు. ప్రతి ఇంటి నుంచి నేరుగా యూజీడీ కనెక్షన్‌లను ఇంటర్మీడియట్ మ్యాన్‌హోల్స్‌కు కనెక్ట్ చేస్తారు. దీంతో సమస్యలు తగ్గుతాయి.

జనాభాకు అనుగుణంగా విద్యుత్ సబ్‌స్టేషన్

శరవేగంగా అభివద్ధి చెందుతున్న గద్దె వెంకట్రామయ్యనగర్, దావుబుచ్చయ్యకాలనీ, వినాయకనగర్‌లలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రూ. 3.6 కోట్లుతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి వేసవికి ముందే వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇక్కడ ప్రతి ప్రాంతాన్ని ఫీడర్లుగా విభజించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

రోడ్డు విస్తరణ

ఈ ప్రాంతంలో మాస్టర్‌ప్లాన్ ప్రకారం 80 అడుగుల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇందుకుగానూ ప్రైవేటు భూమి యజమానులకు బాండ్లు జారీ చేస్తున్నారు. రోడ్డు పనులు పూర్తైతే రామకష్టాపురం నుంచి రామవరప్పాడు రింగ్ వరకు ప్రయాణం సులభమవుతుంది. డివిజన్‌లో కృష్ణా నీటిని అందించడానికి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే మల్లాది విష్ణు శ్రీకారం చుట్టారు. ఇక్కడ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన స్థలం లేదు. దీంతో ప్రైవేటు భూమి యజమానులకు బాండ్లు జారీ చేసి స్థలం తీసుకుని వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నారు.



జీవీఆర్‌నగర్‌లో 80 అడుగుల రోడ్డు విస్తరణ పనులు



దావుబుచ్చయ్య కాలనీలో మ్యాన్‌హోల్స్



30వ డివిజన్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్

వ్యర్థాలను చెత్త సేకరణ సిబ్బందికి ఇవ్వండి



పారిశుద్ధ్య విధానాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరవాసులు ఇంటి నుంచి వచ్చే చెత్త, వ్యర్థ పదార్థాలను ఇంటింటి చెత్తసేకరణ సిబ్బందికి అందించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ సూచించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం సర్కిల్–3 పరిధిలోని 13, 14 డివిజన్లలో పర్యటించి క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. 13వ డివిజన్ జేడీ నగర్‌లో, 14 డివిజన్ శాంతి నగర్, ఎస్ఎస్ఎం స్కూల్ ఏరియా, దర్శిపేటలో పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని చూసి సంబంధిత కార్మికులకు సూచనలు చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది హాజరు చూసి క్రమం తప్పకుండా సిబ్బంది విధులకు హాజరుకావాలని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్లీన్ ఏపీ కార్యాచరణలో భాగంగా నగరపాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణకు నగరవాసులు యూజర్ చార్జీలను చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. స్థానికులు చెత్త సేకరణ సిబ్బందికి తడి, పొడి చెత్తను విడిగా అందించాలని, బహిరంగ ప్రాంతాల్లో చెత్తను వేస్తే జరిమానాలు విధిస్తామని, చెత్తను రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా సేంద్రియ ఎరువులుగా మారుస్తున్నామని వివరించారు. చెత్తసేకరణ సిబ్బందికి లేకపోతే వాహనాలకు కాకుండా బహిరంగ ప్రాంతాలు, డ్రెయినేజీల్లో చెత్త వేస్తే దోమల వ్యాప్తి పెరిగి అనారోగ్యం వస్తుందన్నారు. బహిరంగ ప్రాంతాల్లో చెత్తను వేయవద్దని.. అన్ని సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటికీ నోటీసులు అందించాలని కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో 14వ డివిజన్ కార్పొరేటర్ చింతల సాంబశివరావు, డీఈఈ కరీముల్లా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన త్యాగరాజు జయంతి ఉత్సవాలు



విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజు జయంతి ఉత్సవాలు దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో బుధవారం ముగిశాయి. చివరిరోజు కార్యక్రమాలు నందకిషోర్ గాత్రంతో ప్రారంభమయ్యాయి. సాత్విక భువన కృతిచ, ఘంటసాల సంగీత కళాశాల విద్యార్థినులు, ఎండీబీటీ సుందరి వీణపై త్యాగరాజ కృతులను పలికించారు. నందకిషోర్, శ్రీ విద్య, తెన్నేటి శ్రీ శ్రేయ, పిజనాగపూజిత, పారుపల్లి ఇభానస్, పద్మ సౌమ్య, సుబ్రహ్మణ్యేశ్వరరాజు ఆలపించారు. విద్వాంసుడు గౌరీనాథ్ మాట్లాడుతూ త్యాగరాజ కృతులను నేటి తరాలకు అందించాల్సిన అవసరముందన్నారు. శ్రీ సద్గురు సంగీత సభ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, ఉపాధ్యక్షుడు ప్రభాకర శాస్త్రి, కోశాధికారి వీఆర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళన

- తప్పిన ఇక్కట్లు
- గతంలో మరుసటి రోజు వరకు రోడ్లపైనే వాన నీరు
- నేడు కాసేపటికే రోడ్లపై కానరాని వర్షం నీరు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళనతో మొగల్రాజపురం పరిసర ప్రాంతాల ప్రజలకు ఇక్కట్లు తప్పాయి. గతంలో వర్షం పడితే మరుసటి రోజు వరకు రోడ్లపైనే నీళ్లు నిలిచేవి. నేడు కాసేపటికే డ్రెయిన్లలోకి చేరడంతో రోడ్లు నీళ్లు నిలవడం లేదు. కొన్ని చోట్ల కొత్తగా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం, మరికొన్ని చోట్ల కాల్వలకు మరమ్మతులు చేయడంతో వాహనచోదకులకు వాననీటి అవస్థలు తొలగాయి. మంగళవారం ఉదయం(11.30 నుంచి 1.30 గంటల వరకు, మధ్యాహ్నం రెండు తర్వాత నుంచి సుమారు రెండు గంటలు పైగా) వర్షం కురిసింది. దీంతో మొగల్రాజపురంలోని నైస్‌బార్ జంక్షన్, మధుచౌక్, జమ్మిచెట్టు సెంటర్, మదర్ థెరిస్సా జంక్షన్, సిద్ధార్థ స్కూల్ రోడ్డు, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు, గాయత్రీనగర్, సిద్ధార్థ నగర్‌లోని ప్రధాన, అంతర్గతర రహదారులపై వర్షం నీరు చేరింది.

ప్రధాన డ్రెయిన్ నిర్మాణంతో..

వర్షం తగ్గిన తర్వాత రోడ్లపై నిలిచే నీరు మురుగు కాల్వలు, భూగర్భ డ్రైనేజీల పైపుల ద్వారా ప్రధాన మురుగునీటి కాల్వల్లో కలవడంతో రోడ్డుపై నీరు కానరాలేదు. గతంలో వాన కురిస్తే చాలా సేపటి వరకు వర్షం నీరు రోడ్లపైనే నిలిచేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో కోటి రూపాయల వ్యయ అంచనాతో ప్రధాన డ్రెయిన్ నిర్మాణం చేయడం, సిద్ధార్థ స్కూల్ రోడ్డులో డ్రెయిన్‌కు మరమ్మతులు చేయడం, జమ్మిచెట్టు సెంటర్‌లో ఎప్పటికప్పుడు డ్రెయినేజీ నీటిని తోడించటం వంటి చర్యలతో నీరు రోడ్లపై ఎక్కువ సమయం నిల్వ ఉండకుండా వర్షం తగ్గిన కొద్ది సేపటికే కాల్వల్లోకి చేరుతున్నాయి. దీంతో ఈ ప్రాంతవాసుల ఇక్కట్లు తప్పాయి.



రిలయన్స్ మార్ట్ ఎదురుగా మంగళవారం మధ్యాహ్నం రోడ్డుపై నిలిచిన వాన నీరు



వర్షం తగ్గిన తర్వాత మంగళవారం సాయంత్రం రిలయన్స్ ఎదురుగా ఇలా..

48 మంది ఉద్యోగాలకు ఎంపిక

గుణదల (విజయవాడ తూర్పు): తమ కళాశాలలో బీబీఏ ఆఖరి సంవత్సరం విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక కావడం ఆనందదాయకమని ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ అన్నారు. కళాశాల ఆవరణలో మంగళవారం పలు సంస్థల ప్రతినిధులు క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీబీఏ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు మంచి ఉద్యోగాలకు అర్హత సాధించారని తెలిపారు. టాటా, ఇండిగో సర్వీసెస్‌లో తమ కళాశాలకు చెందిన 48 మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. సుమారు 3 లక్షల వార్షిక ఆదాయం ఉండే ఉద్యోగాలు పొందడం ద్వారా యువకుల జీవితాలు స్థిరపడ్డాయని స్పష్టం చేశారు.

అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కళాశాల అధ్యాపకులు సహాయభాస్కరన్, శ్రీకుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాది బాలాత్రిపుర సుందరమ్మకు పలువురి నివాళి



బాలాత్రిపుర సుందరమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాతృమూర్తి మల్లాది బాలాత్రిపుర సుందరమ్మ భౌతికకాయం వద్ద మంగళవారం పలువురు రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, డెప్యూటీ సీఎం అంజాద్ బాషా, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జీవీడీ కృష్ణమోహన్, ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు లబ్బీపేటలోని ఎమ్మెల్యే విష్ణు నివాసంలో ఆయనకు సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్, సీపీఐ కార్యదర్శి కె రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాసరావు, ముప్పాళ్ల నాగేశ్వరరావు, జోగి మోహన్‌రావు, జోగి వెంకటేశ్వరరావు ఉన్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్వగృహం నుంచి బాలా త్రిపుర సుందరమ్మ అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి



స్మృతివనం పనులు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్మృతి వనం, విగ్రహం నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్వరాజ్య మైదానంలో జరుగుతున్న అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను మంగళవారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అంబేడ్కర్ స్మృతివనం ఆవరణలో వర్షం నీటి గోతులను పరిశీలించి యుద్ధ ప్రాతిపదిక చర్యలు చేపట్టి వాన నీటిని కాల్వల్లోకి మళ్లించాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల మోటార్లు ఏర్పాటు చేసి మైదానంలో వర్షం నీరు నిల్వలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కారిడార్ మొత్తంలో గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రధాన విగ్రహంతో పాటు మిగిలిన పనులనూ సమయంలోపు పూర్తి చెయ్యాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ పర్యటనలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు, కేసీపీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు తగ్గించాలి

డీసీపీ విశాల్‌గున్ని



ఎస్ఎన్‌పురం పీఎస్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీసీపీ విశాల్‌గున్ని

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పెండింగ్ కేసులను తగ్గించాలని పశ్చిమ జోన్ ఇన్‌చార్జి డీసీపీ విశాల్‌గున్ని చెప్పారు. సీపీ టీకే రాణా ఆదేశాల మేరకు డీసీపీ మంగళవారం సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పని తీరు, వారి విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తులోని పురోగతి, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ పరిసరాలు, సీజ్ చేసిన వాహనాలు, లాకప్ గదులు, కంప్యూటర్ గదిని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నిర్మాణదశలో ఉన్న పీఎస్ భవనాన్ని పరిశీలించి త్వరితగతిన పూర్తి చెయ్యాలని చెప్పారు.

ఈ సందర్భంగా డీసీపీ విశాల్‌గున్ని మాట్లాడుతూ బీట్స్ బాగా పెంచి స్టేషన్ పరిధిలో జరిగే రెగ్యులర్ క్రైంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించి నిఘా పెంచి పూర్తిస్థాయి నియంత్రణ చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను వేగంగా పరిష్కరించాలని, స్పందన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. రైల్వేస్టేషన్ వంటి ముఖ్యమైన పరిసర ప్రాంతాల్లో తిరిగే అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చెయ్యాలన్నారు.

పీఎస్ పరిధిలో రోజూ సాయంత్రం పూట విజిబుల్ పోలీసింగ్, ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి సాధారణ ప్రజలకు మేమున్నామనే భద్రత కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో నార్త్ జోన్ ఏసీపీ సిహెచ్ రవికాంత్, సత్యనారాయణపురం ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.